# ప్రగతి సాగరం

**ఉప ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు**

**రెండున్నరేండ్లలో రూ.1,500 కోట్లతో నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధి**

- **50 ఏండ్లలో జరుగని అభివృద్ధిని ఐదేండ్లలోనే చేసి చూపిన కేసీఆర్ సర్కార్**
- **అభివృద్ధి పథంలో గ్రామాలు, మున్సిపాలిటీలు**
- **శరవేగంగా నెల్లికల్ లిఫ్ట్ నిర్మాణ పనులు**
- **2021లోనే హాలియాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు**
- **అభివృద్ధికి జై కొడుతున్న నియోజకవర్గ ప్రజలు**



చకచకా నెల్లికల్ లిఫ్ట్ నిర్మాణం

హాలియా, నవంబర్ 13 : సమైక్య పాలనలో అభివృద్ధికి నోచని నాగార్జునసాగర్ నియోజకవర్గం సీఎం కేసీఆర్ పాలనలో కేవలం ఐదేండ్లలోనే కొత్తరూపు సంతరించుకున్నది. 35 ఏండ్లు ఎమ్మెల్యేగా, 16 ఏండ్లు మంత్రిగా పని చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి చేయలేని పనులను, పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలను స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం పరిష్కరించింది. 2018లో నాగార్జునసాగర్ గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగిరిన తరువాత నియోజకవర్గంలో అభివృద్ధి కొత్తపుంతలు తొక్కింది. విద్య, వైద్యం, ప్రజారోగ్యం, తాగు, సాగునీటితోపాటు విద్యుత్ లోఓల్టేజీ సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి. పరిపాలనా సౌలభ్యం కోసం హాలియా, నందికొండలను మున్సిపాలిటీలుగా చేయడంతోపాటు తిరుమలగిరి(సాగర్)ను నూతన మండలంగా ఏర్పాటు చేసింది. గత ఎన్నికల సమయంలో హాలియా వేదికగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేయడంపై నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్నారు.

## అభివృద్ధిలో దూకుడు..

2021 ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా నోముల భగత్‌కుమార్ గెలిచిన తరువాత నాగార్జున సాగర్ నియోజకవర్గ అభివృద్ధిలో దూకుడు పెరిగింది. గడిచిన రెండున్నరేండ్లలో ఎమ్మెల్యే భగత్ కుమార్ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో నియోజకవర్గానికి రూ.1,500 కోట్ల నిధులు తీసుకొచ్చారు. వీటితో గ్రామాలు, గిరిజనతండాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. హాలియా, నందికొండ మున్సిపాలిటీలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయి. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో గ్రామ, పట్టణాల రూపురేఖలు మారిపోయాయి. హాలియాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, రూ.684 కోట్లతో నెల్లికల్ లిఫ్ట్ పనులు చేపట్టడం, బుద్ధవనాన్ని పూర్తి చేసి సాగర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం, సాగర్ ఎన్ఎస్పీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వారికే వాటిని కేటాయించడం, గిరిజనతండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం, హాలియాలో బంజారా భవన్ నిర్మాణానికి నిధుల మంజూరు, హాలియా, నిడమనూరు, త్రిపురారం, పెద్దవూర మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుతో నియోజకవర్గ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గడిచిన ఐదేండ్లలో నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందింది. కొత్తగా 10 విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసి విద్యుత్ లోఓల్టేజీ సమస్యను పరిష్కరించారు.



నాగార్జునసాగర్‌లో నిర్మించిన బుద్ధవనం

## ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో..


గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తిరుమలగిరి(సాగర్) నూతన మండలంగా ఏర్పాటైంది. హాలియా, నాగార్జునసాగర్ పట్టణాలు మున్సిపాలిటీలయ్యాయి. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు వచ్చింది. రాజవరం మేజర్‌కాల్వ చివరి భూములకు సాగునీరు వచ్చింది, గిరిజన తండాలు గ్రామపంచాయతీలుగా మారాయి. నియోజకవర్గానికి రెండు డిగ్రీ కళాశాలలు మంజూరు చేశారు(హాలియాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నాగార్జున సాగర్‌లో బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల). కృష్ణపట్టె ప్రాంతంలో బీడు భూములకు నీరందించేందుకు రూ.684 కోట్లతో నెల్లికల్ లిఫ్ట్ మంజూరు చేసి పనులు చేపట్టారు. సబ్ జూనియర్ కోర్టు ఏర్పాటు, రూ.18 కోట్లతో సాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రి ఆధునీకరించారు. ఏఎమ్మార్పీ లో లెవల్ కెనాల్(వరదకాల్వ)ను పూర్తి చేసి 80 వేల ఎకరాలకు సాగునీరు అందించారు. నియోజకవర్గంలోని వాగులు, వంకలపై చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతో భూగర్భజలాలు పెరిగాయి. బుద్ధవనం నిర్మాణం పూర్తయ్యింది.

## గత పాలకులు చేసిందేమీ లేదు..

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడింది. తలాపున కృష్ణమ్మ పరుగెడుతున్నప్పటికీ తాగునీరు లేక, కాల్వ చివరి భూములకు సాగునీరు అందక ప్రజలు హరిగోస పడ్డారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ఇక్కడి నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా, 16 ఏండ్లు మంత్రిగా పని చేసినప్పటికీ ఆయన ప్రజలకు చేసిందేమీ లేదు. హరిజన, గిరిజనులను ఓటుబ్యాంక్‌గా వాడుకున్నారే తప్ప వారి అభివృద్ధికి పాటుపడిన దాఖలాలు లేవు.




హాలియాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల




రూ.18 కోట్లతో ఆధునీకరించిన కమలానెహ్రూ ఆస్పత్రి

## నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి..

నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపొందిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, ఆయన తనయుడు నోముల భగత్ కుమార్ గడిచిన ఐదేండ్లలో ఇరిగేషన్ రంగంపై రూ.848 కోట్లు ఖర్చు చేశారు. పట్టణాభివృద్ధికి రూ.112.20 కోట్లు, మౌలిక వసతుల కోసం రూ.755 కోట్లు, ఆరోగ్యరంగానికి రూ.25 కోట్లు, మిషన్ భగీరథకు రూ.108.57 కోటు, విద్యకు రూ.25 కోట్లు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.30 కోట్లు, విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి రూ.686 కోట్లు ఖర్చు చేశారు. హాలియాలో 50 పడకల ఆస్పత్రి, పోస్టుమారం సౌకర్యం కల్పించారు. నియోజకవర్గంలో రూ.684 కోట్లతో నెల్లికల్ లిఫ్ట్ నిర్మాణం, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం కోసం రూ.40 కోట్లు, వరదకాల్వ పూర్తి, పంప్‌హౌజ్ పెండింగ్ బిల్లుల కోసం మరో రూ.55 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. మిషన్ కాకతీయ కింద రూ.40 కోట్లతో 230 చెరువులకు మరమ్మతులు చేపట్టారు. నియోజకవర్గంలోని హాలియా, నందికొండ మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడంతోపాటు ఆయా మున్సిపాలిటీల అభివృద్ధికి గడిచిన నాలుగేండ్లలో రూ.112 కోట్లు మంజూరయ్యాయి. 42 కోట్లతో హాలియా మున్సిపాలిటీలో, 70 కోట్లతో నందికొండ మున్సిపాలిటీలో పనులు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్లు, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ యార్డు, డిజిటల్ లైబ్రరీ, వైకుంఠదామం, ఆడిటోరియం, మినీ స్టేడియం వంటి నిర్మాణాలతో హాలియా, నందికొండ మున్సిపాలిటీలు కొత్తశోభ సంతరించుకున్నాయి.

- స్వరాష్ట్రంలో బుద్ధవనాన్ని పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు కేటాయించి పనులు పూర్తిచేయడంతో కొత్తరూపు సంతరించుకొన్నది. బుద్ధవనాన్ని చూసేందుకు దేశ, విదేశాల నుంచి బుద్ధిస్టు, పర్యాటకులు నిత్యం నాగార్జునసాగర్‌కు వస్తున్నారు.
- నియోజకవర్గంలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం గత తొమ్మిదిన్నరేండ్లలో రూ.686.85 కోట్లు ఖర్చు చేసింది. రూ.13.11 కోట్లతో 132 కేవీ సబ్‌స్టేషన్, 4 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, సుమారు రూ.10 కోట్లతో ఎనిమిది 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. రూ.7.5 కోట్లతో 15 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, రూ.93.29 కోట్లతో 8,133 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, రూ.13.9 కోట్లతో 164.95 కిలోమీటర్ల 33 కేవీ లైన్లు, రూ.86.04 కోట్లతో 11 కేవీ లైన్లు, రూ.93.35 కోట్లతో ఎల్‌టీ లైన్లు, రూ.151.15 కోట్లతో ఇతర పనులు చేశారు. అదే విధంగా నియోజకవర్గంలో 23,419 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రూ.117.095 కోట్లు ఖర్చు చేశారు.
- నియోజకవర్గంలో రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసింది. మన ఊరు–మన బడి కింద నియోజకవర్గంలో 117 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో రూ.2.25 కోట్లతో కేజీబీవీ పాఠశాల భవన నిర్మాణ పనులు చేపట్టారు. తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో రూ.3.35 కోట్లతో కేజీబీవీ పాఠశాలను నిర్మిస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఏడు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో 3,300 మంది పేద విద్యార్థులు చదువుతున్నారు.
- నియోజకవర్గవ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలలో వైద్యులను నియమించారు.రూ.18 కోట్లతో సాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా ఆధునీకరించారు. ఇటీవల పీడియాట్రిక్ విభాగం ఏర్పాటు చేయడంతోపాటు డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. అదే విధంగా హాలియా ప్రాథమికి ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3.5 కోట్లు విడుదల చేసింది. నిడమనూరు, త్రిపురారం, పెద్దవూర మండల కేంద్రాల్లో నూతన పీహెచ్‌సీ భవనాల కోసం ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసింది.
- నియోజకవర్గ వ్యాప్తంగా మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి తాగు నీటి సౌకర్యం కల్పించింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.108 కోట్ల 57 లక్షలు ఖర్చు చేసింది.
- నియోజకవర్గ వ్యాప్తంగా 1.05 లక్షల మంది రైతులకు కారుకు రూ.125 కోట్ల చొప్పున గడిచిన ఆరున్నరేండ్లలో రూ.1,200 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసింది.
- నియోజకవర్గంలోని గుర్రంపోడు మండలం తేరాటిగూడెం, పెద్దవూర మండలం లింగంపల్లి, నిడమనూరు మండలం వల్లభాపురంలో 100 మంది దళిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున రూ.10 కోట్లను అందజేసింది.